18వ
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం,4 ఏప్రిల్ 2025


# ఎండలు తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## – ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** వేసవి కాలం కావడంతో ఎండలు తీవ్రత దృష్ట్యా ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టాసింహాచలం గురువారం సూచించారు. ముఖ్యంగా బయటకు వెళ్ళినప్పుడు గొడుగు లేదా టోపీ పెట్టుకుని బయటకు వెళ్లాలని ప్రాజెక్టు అధికారి సింహాచలం ఏజెన్సీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈసంవత్సరం ఎండలు ఎక్కువగా తీవ్రమవుతున్న నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతంలోని ప్రతి వ్యక్తి ఎండ దెబ్బ తగులకుండా

- తరువాయి 2లో.

## ముస్లింల హక్కులు కాపాడడానికే

# వక్ఫ్ సవరణ బిల్లు

- విపక్షాల అభ్యంతరాలు అర్థరహితం
- సవరణ బిల్లుకు జనసేన సంపూర్ణ మద్దతు
- లోక్‌సభలో జనసేన గళం వినిపించిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ముస్లిం సోదర,సోదరీమణుల హక్కులు కాపాడంతోపాటు, వక్ఫ్ ఆస్తులు పరిరక్షించడానికి వక్ఫ్ సవరణ బిల్లు దోహదం చేస్తుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. బుధవారం లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు-2025పై జరిగిన చర్చలో భాగంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా వక్ఫ్‌బోర్డుకు కోట్లు విలువచేసే 36.18 లక్షలు ఎకరాల భూమి ఉన్నప్పటికీ సరైనచట్టం, పర్యవేక్షణ లేకపోవడంతో వేల ఎకరాలు అన్యక్రాంతం అయ్యాయని తెలిపారు. గతంలో వివాదాస్పద భూములు సంబంధించి వక్ఫ్ ట్రిబ్యునల్ నిర్ణయమే అంతిమం కావడంతో దీర్ఘకాలిక వివాదాలు, ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌తో బాధితులకు అన్యాయం జరిగిందన్నారు. వాస్తవానికి తొలుతవక్ఫ్‌సవరణ బిల్లులో జిల్లా న్యాయ మూర్తి చైర్మన్‌తోపాటు రాష్ట్రప్రభుత్వంలో జాయింట్ సెక్రటరీస్థాయి అధికారి ఉండేలా ట్రిబ్యునల్ పునః నిర్మించాలని ప్రతిపాదించారని, అయితే ముస్లిం మేధావుల వినతి మేరకు జాయింట్ పార్లమెంటరీ కమిటీలో చర్చించి ట్రిబ్యునల్‌లో కొత్తగా న్యాయశాస్త్ర నిపుణున్ని చేర్చుతున్నారని గుర్తుచేశారు. దీంతోపాటు ట్రిబ్యునల్ తీర్పుపై అభ్యంతరాలు ఉంటే 90 రోజుల్లోపు హైకోర్టులో అప్పీలు చేసుకోవడానికి సవరణ బిల్లు అవకాశం కల్పిస్తుందని తద్వారా బాధిత పక్షాలకు మరింత మేలు జరుగుతుందన్నారు. అలాగే గతంలో కలెక్టర్ లేదా డిప్యూటీ కలెక్టర్‌కు సర్వే బాధ్యతను అప్పగించాలని ప్రతిపాదించగా, విస్తృతమైన సమీక్షల తర్వాత వక్ఫ్ ఆస్తుల వాదాలపై విచారణ నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్‌స్థాయి కంటేపై అధికారిని నియమించాలని జెపిసి సూచించిందన్నారు. వక్ఫ్‌ఆస్తుల నోటిఫైడ్ జాబితాను రాష్ట్ర ప్రభుత్వాలు అధికారిక గెజిట్లో ప్రచురించిన 15రోజుల్లోపు పోర్టల్లో అప్లోడ్ చేయాల్సి ఉండగా,ఆ సమయాన్ని 90 రోజులకు

- తరువాయి 2లో.




## ఆర్ట్ ఫెస్టివల్‌ను విజయవంతం చేద్దాం

- వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ
- వీసీ ప్రసన్నశ్రీకి కళల పట్ల ఆసక్తి ప్రశంసనీయం
- ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్:** నేడు(4వతేదీన)సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో జరుగుతున్న "అమరావతి చిత్రకళా వీధి-ఆంధ్రస్ మోస్ట్‌వైబ్రంట్ ఆర్ట్‌ఫెస్టివల్"కు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్తిసహకారం అందిస్తుందని, సమష్టిగా ప్రోగ్రాం ను విజయవంతం చేద్దామని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. గురువారం యూనివర్సిటీ సెమినార్‌హాల్‌లో అమరావతి చిత్రకళా వీధి ప్రోగ్రామ్‌కు సంబంధించి ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లకు శిక్షణ మరియు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.ఆర్.వో ఆనంద్ హాజరయ్యారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ అమరావతి చిత్రకళా వీధి

- తరువాయి 2లో.

## వంతెన నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టాలి

- అధికారులకు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశం
- ఈదరపల్లి రోడ్డు ఆక్రమణలు పరిశీలించిన కలెక్టర్





**అమలాపురం,మేజర్‌న్యూస్ :** నూతనంగా ఏర్పడిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో ఇటీవల కాలంలో ట్రాఫిక్ రద్దీపెరిగిన కారణంగా నూతన వంతెనల నిర్మాణానికి శ్రీకారంచుట్టినట్లు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఈదరపల్లి వంతెనవద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు,జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వంతెన స్థితిగతులు రాకపోకల అంశాలపై శాసనసభ్యులు

- తరువాయి 2లో.

## అంగరంగ వైభవంగా వాడపల్లి వేంకన్న కళ్యాణోత్సవ ఏర్పాట్లు..

- వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ ఎమ్మెల్యే సమీక్ష







**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోరిన కోర్కెలు తీర్చే ఏడువారాల వెంకన్న కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి తీర్థకళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గురువారం కోనసీమ జిల్లా కలెక్టర్ రావిలాల మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వివిధశాఖల అధికారులతో వాడపల్లి ఆలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు సమన్వయంతో కృషిచేసి కళ్యాణోత్సవం పూర్తి అయ్యాల కృషిచేయాలని అధికారులకు సూచించారు. ముందుగా వాడపల్లి ఆలయానికి వచ్చిన కలెక్టర్ రావిలాల మహేష్ కుమార్‌కు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు డిప్యూటీ కమిషనర్ నల్లా సూర్యచక్రధర్‌రావు, వేద పండితులు ఆశీర్వచనాలతో కలెక్టర్

- తరువాయి 2లో.

# రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత





**– ఎమ్మెల్యే బడేటి చంటి,మేయర్ నూర్జహాన్**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి ఉద్ఘాటించారు. అభివృద్ధికి బాటలు వేసేక్రమంలో రహదారుల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏలూరులో శాంతినగర్ నుండి సెయింట్ ఆన్స్ కాలేజ్ వరకూ 22,23,24 డివిజన్‌ల పరిధిలో 4కోట్ల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ గత వైసిపి పాలకుల నిర్లక్ష్యం కారణంగా పాడైపో యిన రహదారుల పునర్నిర్మాణంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని తెలిపారు. ప్రాధాన్యతాక్రమంలో రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. దీనికి అవసరమైన కోట్లాది రూపాయల నిధులను విడుదల చేయడంతో రహదారుల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేయగలిగామన్నారు. నగర మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించిన ఎమ్మెల్యే బడేటి చంటి సారధ్యంలో నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా ముందుకు సాగుతు న్నాయన్నారు.

తొలుత ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ పెదబాబులకు అత్మీయ స్వాగతం లభించింది. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ పప్పు ఉమామహేశ్వ రరావు,కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్,కో–ఆప్షన్ సభ్యులు ఎస్సెమ్మార్ పెదబాబు, చోడే వెంకటరత్నం,కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, నాయకులు వందనాల శ్రీనివాస్,ఆర్నేపల్లి తిరుపతి,గూడవల్లి వాసు, ఆర్‌ఎన్‌ఆర్ నాగేశ్వరరావు,ే కతినేడి భాస్కరరావు, అట్లూరి రామకృష్ణ, అన్నపనేని రవికుమార్, కడి యాల విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి



**– ఎస్టీ,ఎస్సీ బీసీ వర్గాలు అదనపు ప్రయోజనాన్ని పొందాలి**

**మొగల్తూరు,మేజర్‌న్యూస్ :** మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గేదెల వంపు హౌసింగ్ కాలనీని గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 10, 2024 నాటికి ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్న ఎస్సీ, బీసీ వర్గాలకు రూ.50 వేలు, ఎస్టి లకు రూ.75 వేలు అదనంగా ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని, ఆయా మొత్తాలను వినియోగించుకుని ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు.

ఈ సందర్భంలో కాలనీవాసులు రోడ్లు, డ్రైన్లు లేక ఇబ్బంది పడుతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సీసీ రోడ్స్, డ్రైన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలను పంపడం జరిగిందని, త్వరలో చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంలో ఆర్డీవో దాసిరాజు, జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి జి పిచ్చయ్య, తహసిల్దార్ కే రాజా కిషోర్, ఎంపీడీవో సిహెచ్ త్రిశూల పాణి, తదితరులు ఉన్నారు.

## అంగరంగ వైభవంగా వాడపల్లి వేంకన్న కళ్యాణోత్సవ ఏర్పాట్లు..

**మొదటిపేజి తరువాయి**

స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈనెల 7వ తేదీ నుండి 13వ తేదీ వరకు జరిగే కల్యాణ ఏర్పాట్లుపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. 7న ద్వజారోహణ, 8వ తేదీన రథోత్సవం మరియు కళ్యాణ మహెూత్సవం,9వ తేదీన పొన్నవాహన సేవ,10వ తేదీన సదస్యం, మహాదాశిర్వాచనం,11వ తేదీన తెప్పోత్సవం, 12వ తేదీన చక్రస్నానం,13వ తేదీన శ్రీ పుష్పోత్సవం తదితర కార్యక్రమాలపై శాఖల వారీగా తీసుకోవలసిన ఏర్పాట్లపై సమీక్షించి అధికారులకు సూచనలు చేశారు. స్వామివారి కల్యాణ మహెూత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆలయాల పరిశుభ్రత శానిటేషన్ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వైద్య పోలీస్ రెవెన్యూ అధికారులు తీసుకోవలసిన ఏర్పాట్లను సమీక్షించారు. ముందు జాగ్రత్త చర్యలుగా అగ్నిమాపక సిబ్బంది తీసుకున్న ఏర్పాట్లపైన, ఆలయానికి వచ్చే భక్తులకు రవాణా సౌకర్య ఏర్పాట్లపై ఆర్టీసీ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెప్పోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జలవనరులు హెడ్ వర్క్ శాఖ అధికారులు తీసుకోవలసిన ఏర్పాట్లు సూచించారు. వేసవి దృష్ట్యా భక్తులు వడగాల్పుల బారిన పడే ప్రమాదం ఉన్నందున అందుకు తగిన ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులకు వైద్య శాఖ అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఎస్‌పి కృష్ణారావు, ఆర్డీవో శ్రీకర్, డిఎస్పి సుంకర మురళీమోహన్, సీఐ విద్యాసాగర్, తాసిల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకట్ రామన్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టాలి

**మొదటిపేజి తరువాయి**

జిల్లాకలెక్టర్‌కి వివరించారు. వంతెనకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను వారు నిశితంగా పరిశీలించి వంతెన నిర్మాణానికి ఏవిధమైన అడ్డంకులు లేకుండా పూర్తిగా ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు.

వంతెన వద్ద రోడ్ల ఇరువైపులాఉన్న ఆక్రమణల వివరాలను ఆర్డిఓ తాసిల్దారు సర్వేయర్లు జిల్లాకలెక్టర్‌కి రికార్డుల ఆధారంగా వివరించారు. ఆక్రమణలను పూర్తిగా తొలగించి వచ్చే నెలలో నూతన వంతెన నిర్మాణాన్ని రూ.2కోట్ల అంచనావ్యయంతో ప్రారంభించ నున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.పూర్తిగా ఆక్రమణలను తొలగించి నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టాలని రెవెన్యూ స్థానిక పురపాలక, రహదారులు భవనాలశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం వారు నడిపూడి లాకు వద్ద ట్రాఫిక్ మళ్లింపు కొరకు స్థానిక శాసనసభ్యులు ఆనందరావు ప్రతిపాదించిన నూతన ప్రతిపాదిత వంతెన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ బి.కృష్ణారావు, స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారిని కే.మాధవి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.బాబ్జి రాజు, మున్సిపల్ కమిషనర్ కే.వి.వి.ఆర్.రాజు, స్థానిక తాసిల్దార్ అశోక్ కుమార్, రహదారులు భవనాల శాఖ డివిజనల్ ఇంజనీర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎండలు తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మొదటిపేజి తరువాయి**

గొడుగు లేక టోపీ పెట్టుకుని అవసరం ఉన్న సమయంలో బయటకు వెళ్లాలన్నారు. ఉదయం 8గంటల నుండి 11గంటల వరకు, అదేవిధంగా మూడు గంటల తరువాత నుండి ఎండ తీవ్రత తగ్గిన తరువాత బయటకు రావాలన్నారు. చిన్నపిల్లలను ఆసుపత్రులకు ఉదయం 11 గంటలలోపు, అదేవిధంగా సాయంత్రం నాలుగు గంటల తర్వాత చిన్నపిల్లలకు టవలు నెత్తి మీద వేసి తీసుకు వెళ్లాలని ప్రాజెక్టు అధికారి సింహాచలం పేర్కొన్నారు.ఎండతీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని సచివాల యాలలో,అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో,అంగన్వాడీ కేంద్రాలలో అదేవిధంగా ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న ప్రాంతాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు,జింక్ కార్నర్‌ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఎవరైనా ఎండ నుండి వచ్చిన వెంటనే కొబ్బరి నీళ్లు, నిమ్మరసం,గ్లూకోజ్, పల్ల జ్యూసులు ఎక్కువగా త్రాగాలన్నారు. ఈవేసవి కాలంలో కూల్ డ్రింకులు,ఐస్ క్రీములు తీసుకోరాదని ఆయన తెలిపారు.ఎవరికైనా ఎండదెబ్బ తగిలిన వెంటనే చల్లని ప్రదేశంలో కూర్చోబెట్టిన అనంతరం ఆసుపత్రులకు తీసుకువెళ్లాల న్నారు. ఎండ తీవ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, అదేవిధంగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింకు కార్నర్లు ఏర్పాటు చేయాలని ఎడియం అండ్ హెచ్ఓ జి. శిరీష ను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు.

## ముస్లింల హక్కులు కాపాడడానికే వక్ఫ్ సవరణ బిల్లు

**మొదటిపేజి తరువాయి**

పొడిగించాలని జేపీసీ సిఫార్సు చేసిందని గుర్తు చేశారు. సవరణ బిల్లుఆమోదంతో మరింత జవాబుదారి తనం,పారదర్శకతో వక్ఫ్ బోర్డు మరింత బలోపేతం అవుతుందనే ఆశాభవం వ్యక్తం చేశారు.ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేనపార్టీ అణగారినవర్గాలరక్షణకోసం పాటుపడు తుందని, సవరణ బిల్లు ద్వారా ముస్లిం వర్గాల హక్కులకు మరింత రక్షణ కలుకుతుందని జనసేన పార్టీ బలంగా విశ్వసిస్తూ బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు.కీలకమైన బిల్లును తీసుకురావడంతో పాటు, వివరణాత్మక చర్చ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి సూచించిన ప్రధాని నరేంద్ర మోడీ అలాగే మైనార్టీ వ్యవహాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు లకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విస్తృతమైన చర్చలు, సంప్రదింపులు ద్వారా సమర్ధమైన బిల్లును రూపొందించేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ చేసిన కృషిని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అభినందించారు.

## ఆర్ట్ ఫెస్టివల్‌ను విజయవంతం చేద్దాం

**మొదటిపేజి తరువాయి**

– ఆంధ్రస్ మోస్ట్ వైబ్రంట్ ఆర్ట్ ఫెస్టివల్‌కు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు. యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్. విభాగం నుండి 120 మంది వాలంటీర్లు సహకారాన్ని అందిస్తారని తెలిపారు. మన కళలు, సంస్కృతిని తెలియజేసే కార్యక్రమాలలో విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొనియూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాల న్నారు. నిండు గర్భిణి అయినప్పటికి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్విచేస్తున్నకృషి అభినందనీయ మన్నారు. అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విశ్వవిద్యాలయం నుండి 38 మంది కళాకారులు, వివిధ ఆర్ట్సను ప్రదర్శించేందుకు 12 మంది కళాకారులు, హస్తకళలను ప్రదర్శించేందుకు ఏడుగురు విశ్వవిద్యాలయం నుండి హాజరవుతున్నారని చెప్పారు.

కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి మాట్లాడుతూ "అమరావతి చిత్రకళా వీధి –ఆంధ్రస్ మోస్ట్ వైబ్రంట్ ఆర్ట్ ఫెస్టివల్" ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తొలిసారిగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నకార్యక్రమం అని దీనికి సహకరిస్తున్న అందరికి ధన్యవాదాలు తెలుపారు. కళలను సంస్కృతిని ఎంతగానో ఆదరిస్తున్న ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ నన్నయ విశ్వవిద్యాలయం వీసీ గా ఉండటం హర్షనీయమని ప్రశంసించారు. "అమరావతి చిత్రకళా వీధి – ఆంధ్రస్ మోస్ట్ వైబ్రంట్ ఆర్ట్ ఫెస్టివల్" ప్రోగ్రామ్ ను చెప్పినప్పుడు ఎంతో ఆనందంగా అవసరమైన సూచనలు సలహాలు అందించారని అన్నారు.

లైవ్ ఆర్ట్ క్రియేషన్స్, ఆర్ట్ ఎగ్జిబిషన్ అండ్ ఇన్స్టాలేషన్, హస్తకళా ప్రదర్శనలు, ఆర్టిస్ట్ టాక్ సెషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆర్టిస్ట్ అవార్డు అండ్ రికగ్నిషన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.ఆర్.వో. ఆనంద్, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డా.పి.వెంకటేశ్వర రావు, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ ఎం.గోపాలకృష్ణ, ఎ.ఎం.శిరీషా, ఎల్.సుజాత, ఎస్.రాజ్య లక్ష్మీ, ఎల్.ముత్యాల నాయుడు, కె.రాజరాజేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా కేంద్రంలో దాహం.. దాహం.. దాహం..

**- అమృత పైపులైన్ల మార్పిడి వలన నిత్యకృత్యంగా ముడినీటి భూగర్భ పైపులైన్ల లీకేజీలు**

**- ప్రత్యక్ష పరిశీలనతో ప్రభుత్వానికి నివేదిక**

**- పౌర సంక్షేమ సంఘం**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** దిన దిన గండం నూరేళ్ళ ఆయుష్షు చందంగా కాకినాడ నగర పాలక సంస్థ త్రాగునీటి సరఫరా తయారయ్యిందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. సామర్లకోట సాంబమూర్తి రిజర్వాయర్ నీటి నిల్వలను, ఏడిబి రోడ్డు విస్తరణలో చిద్రమైన నూతన పైపు లైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రమణరాజు మాట్లాడుతూ అమృత పథకంలో కోట్ల రూపాయలు వెచ్చించి సాంబమూర్తి రిజర్వాయర్ నుండి గోదావరి జలాల ముడి నీరు శశికాంత్ నగర్‌కు చేరేందుకు వేసిన భూగర్భ పైపులైన్లు నిర్మాణం విజన్ డాక్యుమెంట్ లేకుండా చేయడం వలన రోడ్డు విస్తరణలో వాటిని తొలగించి కొత్త పైపులు నిర్మాణం చేయాల్సిన పనులను జాతీయ రహదారి శాఖ నిర్వహిస్తున్నదన్నారు. ప్రస్తుతం వేసిన పైపు లైన్లు పాత పైపు లైన్లను మించిన నాణ్యత లేకపోవడం వలన అమర్చిన గొట్టాలు క్రింద బల్లపరుపుగా లైన్లు వేయక బరువుకు తొక్కేయడం వలన భారీ లీకేజీ ఏర్పడిందన్నారు. ఈ కారణంగానే గురువారం సాయంత్రం నుండి శుక్రవారం సాయంత్రం వరకు నీరు సరఫరా ఆగిపోయిన దుస్థితి వచ్చిందన్నారు. రోడ్డు విస్తరణలో గత రెండు నెలలుగా జరుగుతున్న పాత భూగర్భ పైపులైన్లు మార్చి కొత్తవి అమర్చిన పనుల్లో నగర పాలక సంస్థ నుండి తగిన పర్యవేక్షక ఇంజనీర్ల బృందం లేకుండా దిగువ స్థాయికి విడిచిపెట్టడం వలన నాసిరకంగా పనులు పూర్తి చేసి కప్పెట్టడం జరిగిందన్నారు. ఏడిబి రోడ్డు పనులు పూర్తయ్యాక సంబంధిత కేంద్ర కాంట్రాక్టర్లు వెళ్ళిపోతారని, ఆ తరువాత ఏర్పడే లీకేజీలు నగర పాలక సంస్థ భరించాల్సి వుంటుందని, ఈ రకంగా ఏడాది పొడవునా ఇదే రకమైన త్రాగు నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. సాంబమూర్తి నగర్ రిజర్వాయర్‌లో నాలుగు అడుగుల మేట పేరుకుపోయి వుండగా గోదావరి నీరు నిల్వల సామర్థ్యం 35 అడుగులు వుండాల్సి వుండగా 31న్నర అడుగుల వరకు నిల్వ వుందన్నారు. రిజర్వాయర్ గట్లు జారిపోతున్న దుస్థితి వుందన్నారు. రెండు దశాబ్దాల క్రిందట వేసిన గట్లు నెర్రలు వేసి జారి పోకుండా వుండే రివెంట్మెంట్ పనులు చేయలేదన్నారు. అడుగున మేట వేసిన నాలుగు అడుగులు సిల్ట్ వ్యర్థాలు తీయకపోవడం వలన 26న్నర అడుగులకు మాత్రమే నీటి నిల్వల లెక్క పరిమితం అవుతున్నదన్నారు. ప్రస్తుతం భూగర్భ పైపు లైన్ల ద్వారా వున్న నీటిని లీకేజీ వద్ద పూర్తిగా వదిలేస్తే తప్ప రిపేర్లు చేయలేని వాతావరణం వుందన్నారు. ఈ మేరకు గొట్టాల్లో నీరు లేకుండా చేయడానికి 18లక్షల కిలో లీటర్ల నీరు వృధా చేందుతు న్నదన్నారు. కార్పోరేషన్ పనుల్లో ముందుచూపు నిర్వహణ లేకపోవడం వలన అమృత పథకం పనుల్లో భూగర్భ పైపు లైన్లు అమర్చి వృధా చేయగా ఇప్పుడు నాసిరకం పైపులతో మార్పు జరిగి తొలి విఘ్నం భారీగా ఏర్పడిందన్నారు. ఈ విఘ్నాలు నిరంతరం జరిగే విధంగా వున్న వైఖరి అక్కడ జరిగిన బాధ్యతారాహిత్య పనుల్లో స్పష్టంగా తెలుస్తున్నదన్నారు. ఆరట్లకట్ట వద్ద మోటార్ల పంపింగ్ ద్వారా ప్రతినెల లక్షల రూపా యల కరెంటు బిల్లులు వృధా అవుతున్నాయన్నారు. ధవళేశ్వరం నుండి భూగర్భ పైపులైన్ల మార్గాన్ని ఏర్పాటు చేస్తే కరెంటు ఖర్చులు భారాలు ఉండవన్నారు. పోలవరం ప్రాజెక్టు వలన గోదావరి నీటి నిల్వలు తగ్గుతాయన్న బెడద వుంటే ఏలేశ్వరం ప్రాజెక్ట్ నుండి భూగర్భ పైపు లైన్లు అమరిక చేయిస్తే శాశ్వత సురక్షిత ముడి నీరు లభ్యం అవుతుందన్నారు. ప్రస్తుతం చేరుతున్న ముడినీరు విధ్వంసకరంగా వుంటున్న తీరు తొలగుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఈ ప్రాజెక్ట్ కరోనా విపత్తు వలన ఆగిపోయిందని ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూటమిగా వున్నందున రూ.300 కోట్ల అంచనాతో వున్న భాగర్భ పైపు లైన్ల నిర్మాణాన్ని పూర్తి చేయించాలని పౌర సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు కోరారు. జ్యోతుల సీతారామమూర్తి హయాంలో 25 సంవత్సరాల విజన్ వలన త్రాగునీరు దక్కిందన్నారు. ప్రస్తుతం స్మార్ట్ సిటీకి తగిన గ్రేటర్ అప్‌గ్రేడ్ విజన్ లేకపోవడం వలన ప్రజాధనం దుర్వినియోగమవుతున్నదన్నారు. కాకినాడకు శాశ్వత స్థాయిగా భూగర్భ పైపులైన్ల ద్వారా పంపింగ్ అవసరం లేని రీతిలో ఫిల్టర్ బెడ్స్ నిర్మాణం వున్న వాటర్ వర్క్స్‌కు శశికాంత్ నగర్ పాయింట్ కు ముడి నీరు చేరే ప్రణాళిక అమలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్పోరేషన్‌లో కమీషనర్, సిటీ ఎమ్మెల్యే, రూరల్ ఎమ్మెల్యే, పార్లమెంట్ మెంబర్, రాజ్యసభ సభ్యులు, శాసన మండలి సభ్యులు సమీక్ష నిర్వహించే సంప్రదాయం లేకపోవడం వలన సమస్యలు జటిలం అవుతున్న దుస్థితి వుందన్నారు. సిఎం, డిప్యూటీ సిఎం కాకినాడ జిల్లా కేంద్రంలో పరిస్థితులు మెరుగుపర్చాలని కోరారు. ప్రత్యేక నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించారు.

# తహసీల్దార్లకు నైపుణ్య పరీక్షల నిర్వహణ



**అమలాపురం, మేజర్ న్యూస్ :** రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని తహసీల్దార్లు రెవెన్యూశాఖ పరిధిలోని వివిధ ఆన్లైన్ సేవలను పూర్తిస్థాయిలో అవగాహనతో స్వయంగా నిర్వహించగలుగుతున్నారా లేదా అన్న విషయాన్ని అంచనా వేసేందుకు నైపుణ్య పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల ప్రధాన ఉద్దేశ్యం తహసీల్దార్లు మ్యుటేషన్లు, భూస్వరూప మార్పులు (ల్యాండ్ కన్వర్షన్), వివిధ మీసేవ ధృవీకరణ పత్రాల (సర్టిఫికెట్ల) ప్రాసెసింగ్, వెబ్‌ల్యాండ్ వంటి ముఖ్యమైన ఆన్లైన్ ప్లాట్‌ఫామ్స్ పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉన్నారా లేదా అనేదాన్ని పరీక్షించడమన్నారు. సంబంధిత సేవలను వారు స్వయంగా, స్వతంత్రంగా నిర్వహించగలిగే సామర్థ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కోనసీమ జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో గల అన్ని మండలాల తహసీల్దారులకు సంబంధిత రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో జాయింట్ కలెక్టర్, సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం నాడు నైపుణ్య పరీక్షలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు షిఫ్టుల వారీగా చేపట్టామన్నారు. ప్రతి తహసీల్దారు ఆన్‌లైన్ సిస్టమ్‌ను ప్రత్యక్షంగా ఉపయోగిస్తూ, ప్రతి సేవను ప్రారంభ దశ నుండి తుది దశ వరకు పూర్తిగా స్వయంగా ప్రాసెస్ చేయగలిగే విధంగా పరీక్షలో పాల్గొన్నారని..

దీనివల్ల తహసీల్దార్లు తమ పని విధానాన్ని మరింత సమర్థంగా మార్చుకోవడానికి, ఆన్లైన్ సేవలను మెరుగు పరిచేందుకు, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని కలెక్టర్ వివరించారు. నైపుణ్య పరీక్షల్లో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై పూర్తి అవగాహన లేని తహసీల్దారులను గుర్తించి, వారికి వివరమైన శిక్షణ ఇవ్వడం, ఉద్భవించే సందేహాలను నివృత్తి చేయడం ప్రత్యేక కార్యక్రమంగా అమలు అమలు చేస్తామన్నారు. ఆన్‌లైన్ సేవల ఆటంకాలను తగ్గించేందుకు, ప్రతి తహసీల్దారు స్వయంగా ఆన్లైన్ సేవలను అందించగలగాలి అనే ఉద్దేశంతో ఈ శిక్షణను కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ నైపుణ్య పరీక్షల ద్వారా తహసీల్దార్లకు ప్రజలకు మెరుగైన, వేగవంతమైన, పారదర్శకమైన రెవెన్యూ సేవలు అందించే సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు.

## 6న రైల్వే కాలనీలో సీతారామ కళ్యాణోత్సవము



కాకినాడ, మేజర్ న్యూస్ : దశాబ్దాల ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన స్థానిక సాంబమూర్తి నగర్ రైల్వే గేట్ సమీపంలో ఉన్న రైల్వే కాలనీలో శ్రీ సీతారామాంజనేయ శ్రీ కనకదుర్గ దేవాలయంలో ఈనెల 6న సీతారామ కళ్యాణోత్సవము జరుగుతోందని ఆలయ ధర్మకర్త చిరంజీవి రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 11:12 ని.లకు పుష్యమి నక్షత్ర యుక్త మిధున లగ్నం నందు సీతారాముల కళ్యాణం ఆలయ అర్చకులు భావరాజు శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. కళ్యాణోత్సవ అనంతరం 12:30 గంటలకు సీరపు వెంకటరమణమ్మ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, భక్తులందరూ పాల్గొనవలసిందిగా ఆయన కోరారు. ఆలయ కమిటీ అధ్యక్షులు రవి కృష్ణ, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి ప్రభుదాస్ స్వీయ పర్యవేక్షణలో ఏర్పాటు చేయడం జరిగిందని చిరంజీవి రెడ్డి వివరించారు. ఆలయ అభివృద్ధికి మరియు అన్నదానానికి విరాళాలు ఇచ్చే దాతలు 7386144998లో సంప్రదించవచ్చున్నారు.

## గ్రామదేవల ఆశీస్సులు అందరికి అవసరం - జాని



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** గ్రామ దేవత ఆశీస్సులు అందరికీ అవసరమని మోటారు రంగ సాంకేతిక నిపుణులు, ఎస్.ఆర్.ఎమ్. కల్చరల్ ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ పాలూరి జానకిరామారావు అన్నారు. బైరుపల్లి గ్రామములో ఉగాది వేడుక సందర్భంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహించడమే కాక పండుగలు వాటి విశిష్టతపై విద్యార్థినీ విద్యార్థులకు అనేక పోటీలను నిర్వహించారు. గురువా రంతో వేడుకలు ఘనంగా పూర్తి అయ్యిందన్నారు. ఈ సందర్భంగా జానకిరామ్ మాట్లాడుతూ పూర్వీకులు ఏ కార్యక్రమాలు నిర్వహిం చినా ముందుగా గ్రామ దేవతలు ఆశీస్సులు తీసుకుంటారని అన్నారు. మన తల్లిదండ్రుల ఆశీస్సులతోపాటు భగవంతుని ఆశీస్సు లు కూడా ముఖ్యమని చెప్పారు. ప్రతి ఏడూ బైరుపల్లి గ్రామ దేవత అయిన పటాలమ్మ దేవత పూజలను స్వయంగా నిర్వహించడమే కాక భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశామన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కే.శ్రీనివాసరావు, కార్యదర్శి బెనర్జీ రావు, కార్యవర్గ సభ్యులు దేవేంద్రరావు, శంకరప్ప, జగదీష్, సురేష్ బాబు, హెచ్.ం ˇమేష్, మురళీధర్, పాలూరి శ్రీనివాసమూర్తి, హరీష్, శంకరప్ప, కే.సోమేశ్వరరావు, తిప్పాచారి, బి.సుబ్రహ్మణ్యం, బి.రమేష్ బాబు, ఎన్.మధు, వై.వి. పరశురామ్, పాలూరి భీమసేనరావు, పాలూరి మోహనకృష్ణ, పటాలమ్మఆలయ ట్రస్ట్ అధ్యక్షులు హెచ్.మురళీధర్, ఉపాధ్యక్షులు రమేష్, కార్యదర్శి పి.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. విజేతులైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## ఎంజిఎన్ఆర్‌జిఎస్ పనులు ప్రారంభం



**అల్లవరం, మేజర్ న్యూస్ :** బోడసకుర్రు గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం నుండి ఎంజిఎన్ఆర్‌జిఎస్ పనులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్, నీటి సంఘం డైరెక్టర్ దొమ్మేటి భావన, నాయకులు నాగేశ్వరరావు, దొమ్మేటి రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్యాము తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వద్దు బ్రో.. - కాకినాడ జిల్లా ఎస్.పి.జి.బిందు మాధవ్



**గండేపల్లి, మేజర్‌న్యూస్ :** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ నందు 'సైబర్ క్రైమ్' అవేర్నెస్, "డ్రగ్స్ వద్దు బ్రో.." మరియు "శక్తి యాప్"పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కాకినాడ జిల్లా ఎస్.పి జి.బిందు మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఆదిత్యకు విచ్చేసిన ఎస్.పి.జి.బిందు మాధవ్‌కు యూనివర్సిటీ ఛాన్సలర్ డా.నల్లమిల్లి శేషారెడ్డి ,ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో. ఛాన్సలర్. డా.మేడపాటి శ్రీనివాస్ రెడ్డి,వైస్ ఛాన్సలర్ డా.ఎం.బి శ్రీనివాస్, పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా.నల్లమిల్లి సతీష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి ఎస్. పి. జి.బిందు మాధవ్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వాడినా, రవాణా చేసిన చాలా నష్టపోతారు అనీ, విద్యార్థులందరూ ఈ విషయం పై అవగాహన కలిగి ఉండాలని కోరారు. డ్రగ్స్ తీసుకున్న , కలిగి ఉన్న,రవాణా చేసినట్లు దొరికిన విద్యార్థులు ఎటువంటి కఠినమైన శిక్షలు ఎదుర్కోవలసి ఉంటుందో సెక్షన్ లతో సహా వివరించారు. ఏ విద్యార్థి అయినా డ్రగ్స్ కేసులో నేరం రుజువైతే అతనికి చట్టరీత్యా కఠినమైన శిక్షలు అనుభవించవలసి రావడమే కాకుండా ఎంతో ఉజ్జ్వలమైన భవిష్యత్తును కోల్పోవలసి వస్తుంది అని తెలిపారు. అంతే కాకుండా జీవితంలో విద్యార్థి దశ ఎంతో విలువైనది దానిని సక్రమ మార్గంలో నడుచుకుంటూ ఉన్నత చదువులు అభ్యసించి మంచి స్థాయికి చేరుకోవాలని, ప్రలోభాలకు మానసిక దౌర్బల్యంతో డ్రగ్స్ వంటి చెడు అలవాట్లతో జీవితాన్ని నాశనం చేసుకోకూడదు అని సూచించారు. శక్తి ఆప్ గురించి మహిళలు అవగాహన కలిగి ఉండాలని విపత్కర సంఘటనలు ఎదురైనప్పుడు కేవలం మొబైల్‌ను షేక్ చేయడం ద్వారా పోలీస్ అధికారులు రక్షణ లభిస్తుంది అని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ శక్తి ఆప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలి అని చెప్పారు. అదే విధంగా మన రాష్ట్రాన్ని మాత్రమే కాకుండా యావత్ దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్య సైబర్ క్రైమ్ అని దీని ద్వారా అనేక మంది అవగాహన లేని కారణంగా అధిక మొత్తంలో డబ్బులు నష్టపోతున్నారని కావున అటువంటి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసిన యడల వెంటనే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఒక వేళ సైబర్ క్రైంలో నష్టపోతే మొదటి అరగంటలో అధికారులకు తెలియపరిచిన రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.పి.జి.బిందు మాధవ్ ను ఆదిత్య యాజమాన్యం తరపున దుశ్శాలువా జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఛాన్సలర్ డా. నల్లమిల్లి శేషారెడ్డి,ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో. ఛాన్సలర్. డా. మేడపాటి శ్రీనివాస్ రెడ్డి,వైస్ ఛాన్సలర్ డా. ఎం.బి శ్రీనివాస్, పెద్దాపురం డి.ఎస్.పి. సి.ఆర్. రాజు,ఎస్.బి.డి.ఎస్. పి.శ్రీరామ్ కోటేశ్వరరావు, ట్రైనింగ్ డి.ఎస్. పి. సిహెచ్. జీవన, జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వై.ఆర్.కె. శ్రీనివాస్, గండేపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శివనాగు,డా.టి. నీలిమ,వివిధ విభాగాధిపతులు ఇతర అధ్యాపక సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి



**- 25 మంది చేనేత కార్మికులకు సోలార్ యూనిట్లు పంపిణీ**

**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధి,సంక్షేమంకోసం అమలు చేస్తున్న స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా మంజూరైన సోలార్ యూనిట్లను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పంపిణీ చేశారు. ఆదివారపుపేటలోని శ్రీ శివ బాలయోగి మహారాజ్ చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం గురువారం జరిగింది. చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తుందని, ఈ స్కీం ద్వారా ఇప్పటికే జాకాడ మోటర్లు, మిషన్లు మంత్రి సుభాష్‌గారిచే గతంలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. సోలార్ యూనిట్లు పంపిణీ ద్వారా విద్యుత్ అంతరాయం ఉన్న సమయంలో కూడా నేత పని చేసుకునేందుకు అవకాశం ఉంటుందని వాసంశెట్టి సత్యం వెల్లడించారు. నేత కార్మికులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధికారులు, కూటమి నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# శ్రీ శృంగార వల్లభ స్వామి కళ్యాణ మహోత్సవంకు ఎమ్మెల్యే రాజప్పకు ఆహ్వానం



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తొలి తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీ శృంగార వల్లభ స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఆహ్వాన పత్రికను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు, కౌడా ఛైర్మన్‌కు తుమ్మల రామ స్వామి (బాబు), పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజుకు, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి మొయిళ్ళ కృష్ణమూర్తి, టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, టిడిపి నాయకులు రేలంగి వెంకట్రావు, ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో అందజేసి, కళ్యాణ మహోత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజప్పను సన్మానించారు. ఇఓ వడ్డి శ్రీనివాసరావు తెలుపుతూ ఈ నెల 7 నుండి 13వ తేది వరకు స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు నిర్వహించబడునని, 8వ తేది రాత్రి 8 గంటలకు స్వామి వారి కళ్యాణం, 9వ తేది ఉదయం 9 గంటలకు గ్రామోత్సవం, సాయంత్రం 4 గంటలకు విశేష అర్చన, 10వ తేదిన ఉదయం 9 గంటలకు సదస్యం, అనంతరం సామూహిక కుంకుమ పూజలు, 11వ తేదిన ఉదయం 9 గంటలకు విశేష అర్చన, సాయంత్రం 4 గంటలకు చ్చోర సంవాదం, 12వ తేదిన ఉదయం 10 గంటలకు, అర్చన, చక్రవారి వసంతోత్సవం, బుక్కా పండుగ, ధ్వజ అవరోహణ, పూర్ణాహుతి, గ్రామోత్సవం, 13వ తేదిన ఉదయం 9 గంటలకు విశేష అర్చన, రాత్రి 7 గంటలకు శ్రీ పుష్పయాగం మరియు ఊంజల్ సేవ, స్వామి వార్కి నిర్వహించనున్నట్లు ఇఓ తెలిపారు.

## భావనారాయణస్వామిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని శ్రీ భావనారాయణస్వామి దేవస్థానాన్ని గురువారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్..కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీతో కలిసి దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. భావనారాయణస్వామి దేవస్థానం యొక్క చరిత్ర, విశిష్టతను ఈ సందర్భంగా పండితులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం సర్పవరం ఏపీఐఐసీ భూములు అనుకుని ఉన్న దేవస్థానం భూములను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే.. రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, కాకినాడ రూరల్ మండలం తహసిల్దార్ ఎస్.ఎల్.ఎన్.కూమారి, భావనారాయణస్వామి దేవస్థానం ఈవో ఎం.లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పంచలోహ విగ్రహాలను బహూకరించిన కాకర్ల దంపతులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రామారావుపేట శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉన్న శ్రీ సీతా రామాలయానికి కాకర్ల శివశంకరరావు, విజయకుమారి దంపతులు శ్రీ సీతారామ లక్మణ సమేత ఆంజనేయ స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను బహుకరించారు. ఈ విగ్రహాలకు రెండు రోజులపాటు శాస్త్రోక్తంగా సంప్రోక్షణ చేసి ఆలయంలో ఉంచుతామని ఆలయ ప్రధాన అర్చకులు మోగంటి నాగ బోగేశ్వర శర్మ, రాంబాబు శర్మ, సదాశివ చార్యులు, రాయ ప్రోలు శ్రీనివాస్ శర్మ తదితర వేద పండితులు విగ్రహాలకు సంప్రో క్షణ నిర్వహించి విగ్రహాలను అందించిన దంపతులకు వేద ఆశీర్వ చనం అందించారు.ఈకార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణా ధికా రి బాదం శ్రీనివాస రాఘవేంద్రరావు దగ్గరుండి పర్యవేక్షణ చేశారు.

## ఆర్యవైశ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**- ఎమ్మెల్యే కొండబాబు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆర్యవైశ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) అన్నారు. ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో భాగంగా కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నూతన కార్యవర్గ సభ్యులతో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని శ్రీరామ సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. మహాసభ ఉపాధ్యక్షులు గ్రంధి నారాయణరావు (బాబ్జి), లలితా ఇండస్ట్రీ మట్టే శ్రీనివాస్, పులవర్తి కుమార్, బచ్చు శేఖర్, రాష్ట్ర, ఉభయ గోదావరి జిల్లాల వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పలువురు ఘనంగా సన్మానించారు.

# ఎన్టీఆర్ బీచ్ పనులు సకాలంలో పూర్తి చేయాలి





**– అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం**

**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో జరుగుతున్న పనులను వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట వద్ద నన్ను ఎన్టీఆర్ బీచ్‌లో జరుగుతున్న పనులను గురువారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు పంతం నానాజీతో కలిసి పరిశీలించారు. కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాలు, బీచ్ క్లీనింగ్, నూతనంగా చేపట్టబోయే వివిధ అభివృద్ధి కార్యకలాపాల పురోగతి, మరుగుదొడ్లు, తాగునీరు సదుపాయాలు ఏర్పాటుపై జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ..పర్యాటక, కాకినాడ నగరపాలక సంస్థ, పంచాయతీ, కుడా తదితర శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ సందర్శకులకు అణువుగా కాకినాడ ఎన్టీఆర్ బీచ్ ను సుందరంగా, ఆకర్షణంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బీచ్ ప్రాంతానికి వచ్చే సందర్శకులు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు అనువుగా బీచ్ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా మెరుగైన సౌకర్యాలు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధి పనులు చేపట్టిందని ఆయన తెలిపారు. వివిధ శాఖల అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేసి బీచ్ పనుల్లో పురోగతి కనబరచాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ప్లాస్టిక్, తూటు, ఇతర పిచ్చిమొక్కలు తొలగించి క్లీన్ అండ్ గ్రీన్‌గా బీచ్ పార్క్ ఉండేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఇన్చార్జి పర్యాటక అధికారి చైత్రవర్షిణి, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత, ఏపీటీడీసీ ఏఈ వెంకటేష్, కుడా ఈఈ సీహెచ్.రామారావు, జిల్లా పంచాయతీ సిబ్బంది ఇతర అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

# కిష్టవరం గ్రామంలో నాగులమ్మ జాతర మహోత్సవం

**– పాల్గొన్న ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం కిష్టవరం గ్రామంలో పూజారి చిట్టమ్మ నాగులమ్మ దేవర జాతర మహోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ మహోత్సవానికి ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బంగారు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి శీలం కృష్ణ పాల్గొని మాట్లాడుతూ ఆదివాసులు యొక్క ఉనికిని మేలుకొలిపే విధంగా ఆచారంలో అనుగుణంగా ఇంటి పేరిట ఇలవేలుపులు సాంప్రదాయబద్ధంగా భారీ ఎత్తున భక్తుల తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటూ వారి యొక్క సంస్కృతి కళ కార్యక్రమంలో పాల్గొనడం చాలా గొప్ప విశ్వాసమని తెలుపుతూ మొక్కులు చెల్లించుకోవడం జరిగింది అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి వ్యవస్థ కమిటీ నాగుల శ్రీరాములు, పి.సరోజినీ, జి.కనకమ్మ, ఏ.రాము, మంగమ్మ మరియు భక్తులు గుండి లక్ష్మణ్, దుర్గారెడ్డి, కాకా రాజు, శాంతమ్మ, లక్ష్మి, స్వరూప, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఖండవల్లి గ్రామంలో రీసర్వే కార్యక్రమం దాదాపు పూర్తి

**– రీ సర్వే వివరాలను రైతులకు తెలియజేశాం**

**– పెరవలి తహసిల్దార్ డి.అచ్యుతకుమారి**




**పెరవలి,మేజర్‌న్యూస్ :** ఖండవల్లి గ్రామంలో జనవరి రెండో తేదీ నుండి ప్రారంభమైన రీసర్వే కార్యక్రమం దాదాపు పూర్తిగా వచ్చిందని పెరవలి మండల తాసిల్దార్ డి.అచ్యుతకుమారి మేజర్ న్యూస్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా ఖండవల్లి గ్రామంలో రైతులు కూటమి నాయకులు రెవెన్యూ అధికారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రెవెన్యూ సిబ్బంది రీసర్వే వివరాలను సంబంధిత రైతులకు తెలియజేశారు. ఈ రీసర్వేలో తేలిన సరిహద్దుల వివరాలు రైతులకు తెలియజేయడానికి తహసీల్దార్ డి.అచ్చుత కుమారీ అధ్యక్షతన ఖండవల్లి గ్రామంలో జనవరి రెండవ తేదీబుధవారం రెవెన్యూసదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తాసిల్దార్ డి.అచ్యుతకుమారి మాట్లాడుతూ ఖండవల్లి గ్రామంలో 2800 ఎకరాల అయకట్టు ఉందని ఇక్కడ రీసర్వే నిర్వహించడానికి 11 టీంలు ఏర్పాటు చేసి జనవరి 2వ తేదీ నుండి రీ సర్వే ప్రారంభించినట్లు తెలియజేశారు. ఈ రీసర్వే కాలంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు ఈ రీసర్వేను పర్యవేక్షించారన్నారు. రీ సర్వే ప్రారంభించి మూడు నెలలు పూర్తయిందని ఖండవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన 11 టీంలు ఎవరికి వారు రీసర్వే లో తేలిన సరిహద్దులు వాటికి సంబంధించిన వివరాలను సంబంధిత రైతులకు తెలియజేస్తున్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఖండవల్లి గ్రామ సర్పంచ్ పులిదింటి నాగరాజు ఉప సర్పంచ్ అధికార వెంకట రామకృష్ణమ్మ సర్వే ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కొవ్వూరు వెంకటేశ్వరరావు డిప్యూటీ తహసిల్దార్ కేసు అన్ని బాబు మండల సర్వేయర్ సతీష్ కుమార్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ పులిగిండు పావని 11 టీములకు చెందిన వీఆర్వోలు వైవి సుబ్బారావు, పాల్పర్తి వెంకటేశ్వర రావు,టీవీ.సుబ్బారావు,వెంపటి శ్రీనివాస్, ఈ. సూరిబాబు, కే.త్రిమూర్తులు, ఖండవల్లి సుబ్బారావు, ఈ. మమ తామూర్తి, ముప్పిడి నాగేశ్వరరావు, సొంగరాజు,బి వెంకటేశ్వరరావు, బి శ్రీనివాస్, తదితరులతో పాటు కూటమి నాయకులు రైతులు పాల్గొన్నారు.

# మహారాణి సత్రం నందు శ్రీ సీతా సమేత శ్రీరాముల వార్కి కళ్యాణం




పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ : పెద్దాపురం పట్టణంలో గల ఎస్.ఆర్.వి.బి.ఎస్. మహారాణి సత్రం నందు వేంచేసియున్న శ్రీసీతా సమేత శ్రీరాముల వారి కళ్యాణం నిర్వహించబడునని, మహారాణి సత్రం కార్యనిర్వాహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు, ఎంపి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, రాజ్య సభ సభ్యులు సానా సతీష్‌బాబు, కౌడా ఛైర్మన్‌కు తుమ్మల రామస్వామి (బాబు)లు పాల్గొననున్నారని, స్వామి వారి కళ్యాణం అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నసమారాధన నిర్వహించబడునని ఇఓ కె.జె.శ్రీనివాస్ తెలిపారు.

# బిసి కార్పోరేషన్ రుణాలకు 1037 మంది అర్జీదారులు హాజరు



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయం, మెప్మా కార్యాలయం నందు గురువారం మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఆధ్వర్యంలో గల పట్టణంలో గల 9 బ్యాంక్ మేనేజర్లతో బిసి కార్పోరేషన్‌కు రుణాలకు ధరఖాస్తు చేసుకున్న అర్జీదారులకు స్క్రూటిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ తెలుపుతూ పెద్దాపురం పురపాలక సంఘానికి సంబంధించి, బిసిలకు 49, కాపులకు 32, ఇ.డబ్ల్యూ.ఎస్. వార్కి కేటాయించిన 6యూనిట్లకు సంబంధించి ఈ స్క్రూటిని కార్యక్రమం బ్యాంక్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, మెప్మా సిఎంఎం జి.భ్రమరాంబ, సిఓలు నర్గీస్, శ్రీదేవి, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారామస్వామి వారి కళ్యాణ మహోత్సవాలు

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో స్థానిక రాతి చెరువు గట్టుపై వేంచేసియున్న శ్రీ సీతారామస్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 7 నుండి 12వ తేది వరకు నిర్వహించబడునని గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి సాయిప్రసాద్ తెలిపారు. 7వ తేదిన ఉదయం 8 గంటలకు స్వామివారి, అమ్మవార్లను కళ్యాణ మూర్తులను చేయుట, సాయంత్రం 4 గంటలకు అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, బలిహరణ, 8వ తేది మంగళవారం సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు శ్రీ సీతారామస్వామి వారి కళ్యాణం, 9వ తేదిన ఉదయం 6 గంటలకు నిత్య హెూమం, బలిహరణ, ఉదయం 8 గంటలకు స్వామివార్కి విశేష పూజలు, 10వ తేదిన ఉదయం 6 గంటలకు నిత్యహెూమం, బలిహరణ, సాయంత్రం 4 గంటలకు సదస్యం (పండితగోష్ఠి సత్కారం), 11వ తేది శుక్రవారం ఉదయం 6 గంటలకు నిత్యహెూమం, బలిహరణ శ్రీ స్వామి వార్కి, అమ్మవార్కి నిత్య పూజా కార్యక్రమములు, 12వ తేది ఉదయం 6 గంటలకు పూర్ణాహుతి, గ్రామోత్సవం, ఉదయం 7 గంటలకు చక్రస్నానం, రాత్రి 7 గంటలకు పూలపాన్పు (సేవ), శ్రీ పుష్ప యాగోత్సవం, దర్పణ సేవ, నిర్వహించబడునని ఇఓ సాయి ప్రసాదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది దుర్గాప్రసాదం తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ క్యాంపస్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన వీసీ



**రాజానగరం,మేజర్ న్యూస్ :**ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ ను వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు. క్యాంపస్ ప్రాంగణాలను, కార్యాలయాలను, వసతీ గృహాలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ కార్యాలయంలో సిబ్బంది హాజరు, పనితీరుపై ప్రిన్సిపాల్ ఆచార్య ప్రశాంతిశ్రీని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పీజీ అడ్మిషన్లు జరుగుతున్న నేపథ్యంలో అన్ని కోర్సులు సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది క్రమశిక్షణతో సమయపాలన పాటించాలని, విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి విద్యాబుద్దులు నేర్పించాలని తెలియజేశారు. అందరికీ ఉన్నత విద్య అందించాలనే మల్లాడి సత్యలింగం నాయకర్ వంటి మహ నీయుల ఉన్నత లక్ష్యాలు ఈ క్యాంపస్ ద్వారా సాకారం కావాలని, దానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. తర్వాత వసతి గృహాన్ని సందర్శించిన వీసీ సిబ్బందిపై సీరియస్ అయ్యారు. వసతి గృహాన్ని, మెస్ ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాణ్యమైన భోజన విద్యార్థులకు అందించాలని అన్నారు. క్యాంపస్ ను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే చక్కని వాతావరణంలో చదువుకోవడానికి వీలవుతుందని చెప్పారు. సమష్టిగా పని చేసి కాకినాడ ఎం.ఎస్.ఎన్. క్యాంపస్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

## వేసంగిలో నీటి ఎద్దడిని నివారించడానికే పశువులకు నీటి తొట్టెలు

– జెడ్పిటిసి జ్యోతి



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** వేసంగిలో పశువులకు నీటి ఎద్ధటి లేకుండా ప్రభుత్వం మండలంలోని ప్రతి గ్రామాల్లో పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని జడ్పిడిసి వడుగుల జ్యోతి అన్నారు. ఏపీఓ రెడ్డి బాబు ఆధ్వర్యంలో జడ్డంగిలో గ్రామ సర్పంచ్ కొంగరమురళీకృష్ణ, దూసర పాములో సర్పంచ్ సిహెచ్ శివ, చెరువు కొమ్ము పాలెం లో సర్పంచ్ నాగేశ్వరరావుఅధ్యక్షతన నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం చేశారు. ప్రభుత్వంఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ ద్వారా నిర్మిస్తున్న పశువుల నీటి తొట్టెలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నాయకులు గణజాల తాతారావు అన్నారు. అలానే మారేడుబాక, చికిలింత, వంచంగి గ్రామాలలో కార్యక్రమం చేయడం జరిగింది.నాయకులు కోపూరి రత్నం, సింగిరెడ్డి రవి, చిన్నమ్మలు, కూటమి నాయకులు,ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎల్ రాంబాబు , ఏపీవో రెడ్డి బాబు ,టెక్నికల్ అసిస్టెంట్ శ్రీను ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారం గ్రహీతను సన్మానం



అనపర్తి, మేజర్ న్యూస్ : ఆంధ్ర రాష్ట్ర ఉగాది పురస్కారం అందుకున్నటువంటి నల్లమిల్లి సుబ్బారెడ్డిని కోస్తా ఆంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. సుబ్బారెడ్డి సేవలను గుర్తించి ఉగాది పురస్కారం ఇవ్వడం జరిగిందని, సుబ్బారెడ్డి సేవలు అభినందనీయమని, ఉగాది పురస్కారం అందుకునే అర్హత సుబ్బారెడ్డికే ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమం సంఘం అధ్యక్షులు కర్రీ త్రినాధ్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి, మరో గౌరవాధ్యక్షులు చింత గోపి కృష్ణారెడ్డి, తాడి చంద్రశేఖర్ రెడ్డి, కేఎస్ఎన్ రెడ్డి, చింతా వీర్రాజు రెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకలు నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి, తాడి సతీష్ రెడ్డి, రామకృష్ణ సేవా సమితి సభ్యులు దుర్గాప్రసాద్, రెడ్డి సంఘం సభ్యులు సత్తి వెంకటరెడ్డి బుల్తమ్మ , యువజన అధ్యక్షుడు తాడి చంద్రశేఖర్ రెడ్డి మరియు సంఘ సభ్యులు సత్తి పోతారెడ్డి చింత నాగూర్ రెడ్డి, నల్లమిల్లి ఆదిరెడ్డి నల్లమిల్లి విను రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై సుబ్బారెడ్డి గారికి అభినందనలు తెలియజేశారు.

# ప్రవీణ్ మృతిపై క్రైస్తవుల శాంతి ర్యాలీ..




**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ :** ఏలేశ్వరం పట్టణంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పట్ల పాస్టర్ ఫెలోషిప్, సెయింట్ ఫాల్స్ లూథరన్ చర్చ్ మండల పాస్టర్స్ ఆధ్వర్యంలో గురువారం శాంతి ర్యాలీ చేపట్టారు. తొలుత తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి బాలాజీ చౌక్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్స్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై చాలా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని, జరిగిన ఘటనపై ప్రభుత్వం న్యాయవిచారణ చేపట్టాలన్నారు. ప్రవీణ్ పగడాల మృతిని రోజురోజుకు పలు రకాలుగా సామాజిక మాధ్యమాలలో చూపిస్తున్నారని, అలా చూపించడం వల్ల క్రైస్తవులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జాన్స్ లూథరన్, పట్టణ మండల అధ్యక్షులు, కేప్రశాంత్ కుమార్,కే సుదర్శన్ డేవిడ్ రాజ్,వి. వత్సలరావు, బి.సుమలత,కే.రవికుమార్, ఎం.సుజాత,ఎం. త్రిమూర్తులు, కుంపట్ల పాల్ ప్రసాద్,జే.రాజు,కే మోహన్ రావు,సి ఆర్,పట్టణ మండల పాస్టర్స్,సంఘ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై పోలీసులు దాడులు

## ఏడుగురు అరెస్ట్, 18 వేలు నగదు స్వాధీనం

– ఎస్సై నరసింహమూర్తి



రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ : మండలంలోని సూరంపాలెం గ్రామం శివారున అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రాజవొమ్మంగి, సూరం పాలెం గ్రామాలకు చెందిన వీరివద్ద నుండి రూ.18,680 నగదు, 52పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలలో కోడి పందాలు గాని, పేకాట, గుండాట, చిత్తులాట వంటి జూదాలు ఆడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** గర్భిణులు ఆరోగ్యకరమైన పౌష్టికాహారంతో పాటు ఎప్పటికపుడు ఆరోగ్య నియమాలు పాటించడం ద్వారా సహజ ప్రసవం జరుగుతుందని సీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ శైలజ అన్నారు. స్థానిక సీహెచ్సీలో గురువారం గర్భిణులు ఆరోగ్యపరంగా తీసుకోవ లసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వ హించారు.

గర్భందాల్చిన మహిళలు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవటమే కాకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యులు సూచనల మేరకు మంచి పోషక విలువులు కలగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకూ సీజేరియన్ లేకుండా సహజ ప్రసవం జరిగేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డా.హారిక, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.2 లక్షల విలువైన ట్రాన్స్ఫార్మర్‌లో రాగి తీగల చోరి...



**ఆలమూరు,మేజర్‌న్యూస్ :** మండలంలోని జొన్నాడ లంక గ్రామంలో గోదావరి నది ఏటిగొట్టు సమీపాన ఏర్పాటుచేసిన ట్రాన్స్ఫార్మర్లో రాగి తీగలు చోరీకి గురైనట్లు స్థానిక రైతులు తెలిపారు. ఆ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ పంట పొలాలకు సాగునీరు అందించేందుకు 25 కేవీ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను అధికారులు ఏర్పాటు చేశారన్నారు. అయితే బుధవారం రాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్తు సరఫరాను నిలిపివేసి ట్రాన్స్ఫార్మర్ ను ధ్వంసం చేసి దానిలోని రాగి తీగలను చోరీ చేశారన్నారు.

ఈ ట్రాన్స్ఫార్మర్ విలువ సుమారు 2 లక్షల రూపాయల విలువ ఉంటుందని స్థానిక లైన్మెన్ తెలియజేశారు. దీనిపై సంబంధిత అధికారులు, పోలీస్ సిబ్బంది తగు చర్యలు తీసుకుని, ఆప్రదేశంలో మరొక ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేయాలని రైతులు కోరుచున్నారు.

# సర్వ మానవాళి సమానమేననే శ్రీ కృష్ణ తత్వాన్ని అలవర్చుకోవాలి

– కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆలమూరు, మేజర్‌న్యూస్ :** సర్వ మానవాళి అంతా సమానమేననే శ్రీ కృష్ణ తత్వాన్ని అందరూ అలవర్చుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం మడికి రావిచెట్టు సెంటర్ వద్ద ప్రజా విరాళాలతో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ మందిర్ లో అర్చక బ్రహ్మ కాళ్ళకూరి కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరిగిన శ్రీకృష్ణుని విగ్రహం ప్రతిష్టలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఎమ్మెల్యే బండారుకు స్వాగతం పలికారు. శ్రీకృష్ణుడు గీతలో బోధించినట్లు సాటి మానవులపై దయ, ప్రేమ కలిగి ఉండాలని, ప్రతి మానవుడు చేసిన కర్మఫలం తప్పక అనుభవించవలసి వస్తుందని సాధ్యమైనంత వరకు తప్పులు చేయడానికి దూరంగా ఉండాలని అన్నారు. తమకు ఉన్నంతలో దానధర్మాలు, పుణ్య కార్యక్రమాలు చేయాలని అన్నారు. ఆలయం వద్ద ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అలాగే కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శ్రీకృష్ణుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణులు, ప్రవచనకర్త శ్రీమాన్ సత్య గోపీనాథ్ దాస్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ తత్వాలను భక్తులకు బోధించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

# మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వాటర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలోని నీటి ఎద్దడిని గుర్తించిన మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వాటర్ కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని మోటర్, పైప్ లైన్స్, హ్యాండ్ బోర్స్, ట్యాంకులకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే వాటర్ కంట్రోల్ రూమ్‌కి ఫోన్ ద్వారా సమాచారాన్ని ఇవ్వాలని అన్నారు. చింతూరు మండల ప్రజలు ఈ యొక్క సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వాటర్ కంట్రోల్ రూమ్ నెంబర్ 919550111895 కి సమస్య ఉంటే ఈనెంబర్‌కి కాల్ చేయవలసిందిగా మండల ప్రజలను కోరారు.

# అక్రమ గ్రావెల్ తవ్వకాలపై.. ఉక్కు పాదం





**రాజానగరం,మేజర్‌న్యూస్ :** కొత్త తుంగపాడు గ్రామంలో సర్వే నెం:792లో అక్రమ గ్రావెల్ త్రవ్వకాలు చేయుచున్న ప్రదేశమును జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ, రాజమహేంద్రవరం, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా తనిఖీ నిర్వహించి అక్రమ గ్రావెల్ త్రవ్వకాలు చేయుచున్న 4 పొక్లైన్లను సీజ్ చేయుట జరిగినదని జిల్లా మైన్స్ అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలియచేసారు.సదరు త్రవ్వకాలు జరిపిన భూమి యొక్క వివరములు పూర్తిగా విచారించిన పిదప తనిఖీ చేయు అధికారులు శాఖ పరమైన చర్యలు త్రవ్వకాలు జరిపిన వారిపై తీసుకొనబడునని తెలియ చేయడం జరిగింది.

# జమ్మలమడక నాగమణికి ఘన సన్మానం




**కాకినాడ, మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉభయగోదావరి జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇంచార్జ్, మాజీ ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణిని మహిళా నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

మాజీ ఎంపీ మార్గాని భరత్ క్యాంప్ కార్యాలయంలో జమ్మలమడక నాగమణిని సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకురాలని, ప్రభుత్వ విధానాలను ఎండగట్టే దమ్మున్న నాయకురాలు జమ్మలమడక నాగమణి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి శ్యామల, పార్టీ మహిళా నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెవెన్యూ మంత్రిచే తహసిల్దార్ కార్యాలయం ప్రారంభం ఏర్పాట్లు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట బలుసుల పేటలో నిర్మిస్తున్న తహసిల్దార్ నూతన కార్యాలయాన్ని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి చేతులమీదుగా త్వరలో ప్రారంభించినట్టు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. గురువారం సాయంత్రం ప్రారంభానికి సిద్ధమవుతున్న తహసిల్దార్ కార్యాలయం పనులను ఎమ్మెల్యే చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు అత్యంత వేగవంతంగా జరుగుతున్నట్టు చెప్పారు.

కార్యాలయానికి అవసరమైన అన్ని వసతులతో పూర్తవుతున్నందున త్వరలోనే రాష్ట్ర రెవిన్యూ మంత్రి చేతుల మీదుగా ఈ కార్యాలయాన్ని ప్రారంభించినట్టు ఆయన చెప్పారు. అలాగే బలుసులపేట ఎస్సీ సామాజిక వర్గాలకు చెందినటువంటి ప్రాంతం కావడంతో ఇక్కడ ఎస్సి కళ్యాణ మండపం నిర్మాణానికి రూ. 10 లక్షలు నిధులు ఇప్పటికే మంజూరు చేయగా మరో రూ. 10 లక్షలు నిధులను కేటాయించనున్నట్టు చెప్పారు. ఎస్సీ సామాజిక వర్గ ప్రాంతానికి సమీపంలోనే తహసిల్దార్ కార్యాలయం ఏర్పాటు జరగడం మంచి పరిణామం అన్నారు.

# జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గున్నబాబుకి ఘన సత్కారం



**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ :** ఏలేశ్వరం ఇటీవల కాకినాడ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా వాగు గున్నబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా గున్నబాబును ఏలేశ్వరం మండల ఆర్యవైశ్య సభ్యులు ఘనంగా సత్కరించారు.ఈసందర్భంగా గున్న బాబు మాట్లాడుతూ కాకినాడ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వూర నానాజీ, మాటూరు సూరిబాబు,పులవర్తి శీను, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆక్వా ఫీడ్ కెమికల్స్ దుకాణదారులకు లైసెన్స్ తప్పనిసరి

- లైసెన్స్ లేకపోతే దరఖాస్తు అయినా చేసి వుండాలి
- లేకపోతే రూ.5 లక్షల జరిమానా
- జిల్లా మత్స్యశాఖ అధికారి వర్ధన్ వెల్లడి

**అమలాపురం, మేజర్‌న్యూస్ :** గత మార్చి 24వ తేదీన జరిగిన ఆక్వా రంగంలో యాంటీ బయోటిక్ నిషేధంపై ఏర్పడిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఈనెల 30వ తేదీ లోపు జిల్లాలోని ఆక్వాఫీడ్ కెమికల్స్ విక్రయించు దుకాణ దారులందరూ తప్పనిసరిగా ఏపీ రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి చట్టం కింద లైసెన్సులు విధిగా పొంది ఉండాలి లేదా దరఖాస్తు చేసి ఉండాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎల్.బి.ఎస్. వర్ధన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లేనిపక్షంలో మే నెల ఒకటో తేదీ నుండి నిర్వహించే తనిఖీలలో లైసెన్సులు పొందని లేదా దరఖాస్తులు చేయని దుకాణదారులకు చట్ట ప్రకారం రూ.5 లక్షల జరిమానా విధించడం జరుగుతుందని ఆయన ప్రకటనలో తెలిపారు.కావున ప్రతి దుకాణ దారుడు తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని లేదా దరఖాస్తు చేసి ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

## ప్రాసెసింగ్ యూనిట్లు సరఫరాపై సందేహాలు ఉంటే ఐటీడీఏను సంప్రదించాలి

**రంపచోడవరం, మేజర్‌న్యూస్ :** రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలోని వందన వికాస కేంద్రాలకు సరఫరా చేసే జీడిపిక్కలు, ప్రాసెసింగ్ యూనిట్లు సరఫరాపై ప్రజలకు సందేహాలు ఉంటే వెంటనే ఐటీడీఏ కార్యాలయంలో సంప్రదించాలని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు.ఏజెన్సీ ప్రాంతంలోని వీడివీకేలు అభివృద్ధి చేయుటకు, వీడివీకెలు ద్వారా కొనుగోలు చేసిన జీడి మామిడి పిక్కలు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు సంబంధించి యూనిట్లు పై ఏమైనా సందేహాలు ఉంటే వాటిపై టోల్ ఫ్రీ నెంబర్ 08864-2421135, 944801435లో సంప్రదించాలని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.

## టీచర్ ఆనందరావు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సత్యానందరావు చేతుల మీదుగా చెక్కును అందించిన యూటీ ఎఫ్ బృందం



ఆలమూరు,మేజర్‌న్యూస్: నర్సిపూడి గ్రామంలో ఇటీవల మరణించిన యూటీఎఫ్ సభ్యులు గొంగడ ఆనందరావు మాష్టారు కుటుంబ సభ్యులకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా మూడు లక్షల రూపాయల చెక్కును యూటీఎఫ్ టీచర్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాటి సభ్యుడు మరణించినావారి కుటుంబసభ్యులకు అండగా ఉంటూ ఆర్థిక సహాయాన్ని అందించినందుకు అభినందించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మారేడుమిల్లి మండలంలో కాఫీ నర్సరీ ఏర్పాటు చేయాలి

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మారేడుమిల్లి మండలం పరిధిలో గిరిజన రైతులకు కాఫీ మొక్కల పెంపకం కొరకు నర్సరీ ఏర్పాటు చేసి, మొక్కలు సరఫరా చేయడానికి సహకరించాలని టి.ఎన్.ఎస్.ఎఫ్. రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పల్లాల రాజ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కాఫీ బోర్డు ఓఐఎస్ డి.సునీల్ బాబును కలిసి, వినతిపత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. గూడెం కొత్తవీధి మండలంలోని ఆర్వీ నగర్ ప్రాంతీయ కాఫీ పరిశోధన స్థానంను సంస్థ సీఈఓ ఎస్.మణికంఠ తో కలిసి సందర్శించినట్లు సెంటర్ ఫర్ ట్రైబల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రెసిడెంట్, టి.ఎన్.ఎస్.ఎఫ్. రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పల్లాల రాజ్ కుమార్ రెడ్డి తెలిపారు. మారేడుమిల్లి మండలం పరిధిలో రైతులకు కాఫీ మొక్కల పెంపకం కొరకు నర్సరీ ఏర్పాటుతోపాటు మొక్కలు సరఫరాకు సహకరించాలని కోరామన్నారు. రంపచోడవరం ఏజెన్సీ డివిజన్ పరిధిలోని సానుకూలంగా ఉన్న చోట రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, కాఫీ రీసెర్చ్ సెంటర్ కోసం



ఈసందర్భంగా చర్చించుకోవడం జరిగిందని తెలిపారు. కాఫీ మొక్కల పెంపకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించారని రాజ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి రోటరీ క్లబ్ భద్రాచలం చేయూత



**ఎటపాక, మేజర్ న్యూస్ :** గత నెల హెూలీ పండుగ రోజున మార్చి 14వ తారీకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం సీతాపురం గ్రామంలో ఎస్సీ కాలనీలో రోజువారి కూలి పని చేసుకొనే కాటూరి నరసమ్మ యొక్క తాటాకు ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. ఈ విషయాన్ని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు రోటరీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ షేక్ అజీమ్‌కి తెలియజేయగా వారు వెంటనే స్పందించి రోటరీ క్లబ్ భద్రాచలం వారు బాధిత కుటుంబానికి 10,000 రూపాయల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు ధారా బాలాజీ, వైస్ ప్రెసిడెంట్ షేక్ అజీమ్, సెక్రెటరీ నూకల విద్యాసాగర్, ట్రెజరర్ వందవాసు శీను మరియు తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వల్లభనేని చందు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దుద్దుకురి సతీష్, కొట్టే బాబు, కుచ్చెలపాటి కొండయ్య, దారా సంతోష్, ముక్తేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్....



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** ఈరోజు ఉదయం హర్యానా రాష్ట్రానికి చెందిన ఫరీదాబాద్ జిల్లాకు చెందిన రాకేష్ నరావత్ తండ్రి జగదీష్ వైజాగ్ ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ గంజాయిని కొనుగోలు చేసి సుమారు 16 కేజీల గంజాయిని హర్యానా రాష్ట్రానికి తరలిస్తుండగా ధవళేశ్వరం సిఐ మరియు వారి సిబ్బంది కలిసి వ్యక్తిని పట్టుకొని అతని వద్ద నుండి 16 కేజీల గంజాయిని స్వాధీనపరచుకొని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించిన ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సిఐ టి.గణేష్ మరియు సిబ్బందిని ఎస్పి డి.నరసింహకిషోర్,మరియడిఎస్పి.భవ్యకిషోర్ అభినందించారు.

# అవిశ్వాసం పేరుతో మా కుటుంబాన్ని రోడ్డుకి ఈడ్చారు

**- మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణ మూర్తి**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ప్రస్తుతం అవిశ్వాసం పేరుతో మా కుటుంబాన్ని రోడ్డుకు ఈడ్చి అవమానించారని, చైర్ పర్సన్ పదవిపై పెట్టిన అవిశ్వాసాన్ని తాము ఎదుర్కొంటామని మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చైర్ పర్సన్ గృహంలో చైర్ పర్సన్ అరుణ కృష్ణమూర్తి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ తప్పు లేకపోయినా అవిశ్వాసం కోసం తనకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్‌కు లెటర్ ఇచ్చారన్నారు. చైర్ పర్సన్ పదవి నుంచి తప్పుకోమని వైసీపి ఇంచార్జి దవులూరి దొరబాబు గానీ ఆయన తండ్రి సుబ్బారావు గాని తనను అడిగి ఉంటే సంతోషంగా తప్పుకునే దాననని, అలాకాకుండా తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తమ కుటుంబాన్ని రోడ్డుకీ డ్చడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు.కౌన్సిలర్‌గా నెగ్గిన తాను ఎలాంటి పదవులను ఆశించలేదని,ఇంచార్జి దొరబాబు, సుబ్బా రావులు మా ఇంటికి వచ్చి తాను చైర్ పర్సన్ పదవికి అనుకూలమైన దానిగా చెబుతూ నన్ను బలవంతంగా చైర్ పర్సన్ గా నిలబెట్టారన్నారు. అప్పట్లో చైర్ పర్సన్ పదవి కోసం ఆరాటపడుతూ డబ్బు సంచితో తిరిగిన ఒక కాంట్రాక్టర్ పై నమ్మకం లేక తనను చైర్ పర్సన్ చెయ్యగా ప్రస్తుతం అదే వ్యక్తిని తెరపైకి తెస్తూ తనపట్ల రాజకీయం నడుపుతున్నారని అరుణ కృష్ణమూర్తి విమర్శించారు.

-నేను డమ్మీ చైర్ పర్సన్‌నని ప్రచారం చేశారు..మున్సిపాలిటీ లోనూ ఇతర అధికారుల వద్ద తాను డమ్మీ నని, నా మాటలు వినవద్దని ఇంచార్జి దొరబాబు, ఆయన తండ్రి సుబ్బారావులు చెబుతూ తనను అవమానపాలు చేశారని అరుణ ఆరోపించారు.బయట కార్యక్రమాల్లో తనకు విలువనీయకుండా,ఎట్టి పరిస్థితుల్లో మీడియాతో మాట్లాడకుండా నాగొంతు నొక్కి,నాకాళ్లు కట్టి పడేశారని ఆమె ఆరోపించారు. పట్టణంలో జరిగిన ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొన్న తనను తెలుగుదేశంపార్టీలో చేరిపోతుందని లేనిపోని పుకార్లు, విమర్శలు పుట్టించారన్నారు. పట్టణం మొత్తం అభివృద్ధి కోసం కొద్దిరోజుల క్రితం ఎజెండాను తయారుచేసి కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టగా దానిపై కౌన్సిలర్లు ఏ విధంగానూ చర్చ జరుపకుండా సమావేశం నుంచి వాకౌట్ చెయ్యడం దారుణమన్నారు. అనంతరం కమిషనర్ ఛాంబర్ లోనికి వెళ్లి కొన్ని అంశాలను ఆమోదిస్తున్నట్టు ప్రకటించడం తనను ఉద్దేశపూర్వకంగా అవమానపరచడం కాదా అని ఆమె ప్రశ్నించారు. నిధులను తీసుకొచ్చి పట్టణమంతా అభివృద్ధి జరిపించాలనే ఉద్దేశంతో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చేపడుతున్న అభివృద్ధి పనులకు వైసిపి కౌన్సిలర్లు అడ్డు తగలడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇన్చార్జి దొరబాబులు ఎన్నిసార్లు కలిసి మాట్లాడదామని ప్రయత్నించినా ఆయన అవకాశం ఇవ్వకుండా తప్పించుకున్నారని, చైర్మన్ పదవిని గతంలో ఒప్పందం ప్రకారం దవులూరి పార్వతికి అప్పగించేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అది కాకుండా మరి ఎవరికి చైర్ పర్సన్ పదమని కట్టబెట్టేందుకు ప్రయత్నించినా అవిశ్వాసాన్ని తాము ఎదుర్కొంటామని ఈ సందర్భంగా చైర్పర్సన్ అరుణ కృష్ణమూర్తి దంపతులు స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు కాటూరి జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# మడికి శ్రీరాములుకు ఘన సన్మానం



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం ఛైర్మన్‌గా మడికి శ్రీరాములు నియమితులయ్యారు డా. బాబూ జగజ్జీవన్ రామ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు మడికి శ్రీరాములుకు గురువారం సవరపు నాని బాబు అధ్యక్షతన ఎత్తు రోడ్ దగ్గర కామనగరువు విక్టోరియాపేటలో జరిగిన సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నాని బాబు మాట్లాడుతూ గత 24 సంవత్సరాలుగా మడికి శ్రీరాములు ఉద్యోగ సంఘ నాయకులుగా ఉంటూ ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి సహకారం అందిస్తూ జాతికి ఎంతో సేవ చేసారని, భవిష్యత్‌లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో నేదునూరి వెంకటరెడ్డి, ముస్కూడి సతీష్, సవరపు ఏసు, నేదనూరి ప్రశాంత్, సవరపు ప్రసాద్, చేట్ల సాయిక్రిష్ణ, యస్.జగజ్జీవన్, ఎ.కయీను, ఎ.రాజు, యం.ప్రేమ్ కుమార్ మొదలగువారు పాల్గొన్నారు.

## త్రాగు నీటి సమస్య నువెంటనే పరిష్కారం చేయడం జరుగుతుంది- ప్రేమ సాగర్



**ఎటపాక, మేజర్ న్యూస్ :** మండలంలో ఎక్కడైనా త్రాగు నీటి సమస్య ఉంటే వెంటనే పరిష్కారం చేయడం జరుగుతుంది అని ఎటపాక ఎంపీడీవో ఈ ప్రేమ్ సాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలో జిల్లా కలెక్టర్ హాయ్ సార్ మేరకు వేసవికాలం దృష్ట్యా మోటర్, పైప్ లైన్, హ్యాండ్ బోర్స్, ట్యాంక్ పరిశుభ్రత మొదలైన వాటిలో ఏదైనా సమస్య ఉంటే మండల పరిషత్ కార్యాలయం లో తెలపగలరని, లేదా కంట్రోల్ రూమ్ నెంబర్ 7207012902కు ఫోన్ చేసి తెలపగలరని ఆయన ఓ ప్రకటనలో తెలియజేయడం జరిగింది.

## ముంపు మండలాల సమస్యలపై మంత్రి వాసంశెట్టిని కలసిన జమాల్ ఖాన్



**చింతూరు,మేజర్‌న్యూస్:** పోలవరం ముంపు మండలాలైన చింతూరు,ఏటపాక,కూనవరం,వీఆర్పురం మండలాలలో అనేక మౌలిక సమస్యలపై గురువారం ఆంధ్రప్రదేశ్ రాజధాని అయిన అమరావతి సచివాలయంలో ఉన్న కార్మిక,వైద్య,కర్మాగారాల మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ మర్యాద పూర్వకంగా కలిసిముంపు మండలాల సమస్యలు వివరించారు. ప్రధానంగా గిరిజన గ్రామాల్లో త్రాగునీటి సమస్య నెలకుందని, అలాగే గిరిజనులు రెండో పంటగా వెసులుబాటుగా ఉన్న బీడీ ఆకు సేకరణకు అటవీశాఖ నిర్లక్ష్యంని మంత్రికి వివరించారు. ప్రధానంగా గ్రామాల్లో రోడ్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలను అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటానని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.